## మరిమడ్లలో పులి సంచారం ఫేక్

కోనరావుపేట, అక్టోబర్ 1: మరిమడ్లలో పులి సంచరిస్తున్నట్లు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్న వీడియో ఫేక్.. అనిఅటవీ శాఖ అధికారులు పేర్కొన్నారు. మరిమడ్ల కొండ చెరువు వద్ద అటవీ ప్రాంతంలో పులి సంచరించినట్లు వాట్సాప్‌లో వీడియో వైరల్ అవుతున్నది. దీంతో ప్రజలు భయందోళనకు గురయ్యారు. ఈ విషయమై అటవీశాఖ అధికారులను సంప్రదించగా, పులి సంచారం అవాస్తవమని వాట్సాప్‌లో వైరల్ అవుతున్న వీడియో ఇక్కడిదికాదని తేల్చిచెప్పారు. అవాస్తవాలను సామాజిక మాధ్యమాల్లో వైరల్ చేసి ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పులి సంచారం మరిమడ్లలో జరుగలేదని, ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని వెల్లడించారు.

## వృద్ధుల దినోత్సవం



తహసీల్ కార్యాలయంలో వృద్ధులను సన్మానిస్తున్న ఆర్డీవో మధుసూదన్

వేములవాడ రూరల్, అక్టోబర్1: వేములవాడ అర్బన్ తహసీల్ కార్యాలయంలో అంతర్జాతీయ వృద్ధుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆర్డీవో మధుసూదన్‌గౌడ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా 80 ఏండ్లు దాటిన వృద్ధులను సత్కరించి, మాట్లాడారు. నేటితరం చూపిస్తున్న వ్యవహారశైలిని పరిగణనలోకి తీసుకొని అంతర్జాతీయ స్థాయిలో వృద్ధుల దినోత్సవాన్ని జరుపుకొంటున్నామని తెలిపారు. వృద్ధులను పట్టించుకోవాలని, జీవిత చరమాంకంలో అండగా నిలువాలని కోరారు. కార్యక్రమంలో తహసీల్దార్ సురభి మహేశ్, ఎలక్షన్ డీటీ శ్రావణ్‌కుమార్ పాల్గొన్నారు.

## కేసీఆర్‌ను సీఎంగా మరోసారి గెలిపించుకుందాం



ఎస్సీ భవన అదనపు పనులకు భూమిపూజ చేస్తున్న ఎంపీపీ, జడ్పీటీసీ

వేములవాడ రూరల్, అక్టోబర్ 1: కేసీఆర్‌ను మూడోసారి ముఖ్యమంత్రిగా గెలిపించుకోవాలని వేములవాడ ఎంపీపీ బూర వజ్రమ్మ, జడ్పీటీసీ మ్యాకల రవి పేర్కొన్నారు. ఆదివారం వేములవాడ మండలం చింతల్‌ఠాణాలోని ఎస్సీ భవన అదనపు పనులకు వైస్‌ఎంపీపీ ఆర్సీ రావు, సర్పంచ్ రేగులపాటి రాణి, సెస్ డైరెక్టర్ రేగులపాటి హరిచరణ్‌రావుతో కలిసి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, బీఆర్ఎస్‌తోనే గ్రామాల్లో అభివృద్ధి జరుగుతున్నదని తెలిపారు. మూడోసారి ముఖ్యమంత్రిగా కేసీఆర్, ఎమ్మెల్యేగా చల్మెడ లక్ష్మీనరసింహారావును భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు. ఎమ్మెల్యే రమేశ్‌బాబు నిధులతో భవన నిర్మాణ పనులు ప్రారంభమైనట్లు తెలిపారు. మండల పరిషత్ నిధులతో రాబోయే రోజుల్లో మరిన్ని పనులను పూర్తి చేస్తామన్నారు. కార్యక్రమంలో నాయకుడు బూర బాబు, కుల సంఘాల సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

## అర్చకులకు శిక్షణ తరగతులు ప్రారంభం

వేములవాడ టౌన్, సెప్టెంబర్ 30: దేవాదాయ, ధర్మాదాయశాఖ ఆదేశానుసారం ఉమ్మడి జిల్లాలోని ధూప దీప, నైవేద్యం స్కీంలోని అర్చకులకు ఆదివారం రాజన్న ఆలయ ఓపెన్ స్లాబ్‌పై శిక్షణ తరగతులు ప్రారంభమయ్యాయి. దాదాపు 150మంది అర్చకులు శిక్షణ తరగతుల్లో పాల్గొన్నారు. ప్రత్యేకంగా చేయాల్సిన పూజా విధానాలు, ఆలయంలో పాటించాల్సిన నియమాలు, నిత్య కల్యాణం, కల్యాణోత్సవాలు, నిత్య పూజల విధానం, వాటి ప్రాముఖ్యత గురించి పలువురు పండితులు వివరించారు. సోమ, మంగళవారాల్లో కూడా కార్యక్రమాలు కొనసాగుతాయని వారు తెలిపారు. ఇక్కడ ఉమ్మడి జిల్లా సహాయ కమిషనర్ చంద్రశేఖర్, ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ, ఉడుతల వెంకన్న, రమణారెడ్డి, కృష్ణారెడ్డి, వీరశైవాగమ పండితులు మోహనపు ఆనందయ్య, ఆకవరం శివప్రసాద్, నాగయ్యస్వామి, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆకవరం శివప్రసాద్



శిక్షణ తరగతులకు హాజరైన ధూప దీప, నైవేద్య స్కీం అర్చకులు



చందుర్తి: చీపుర్లతో రోడ్డును శుభ్రం చేస్తున్న ప్రజాప్రతినిధులు, విద్యార్థులు, సిబ్బంది



వేములవాడ రూరల్: మల్లారంలో చేపట్టిన శ్రమదానంలో పాల్గొన్న విద్యార్థులు, ప్రజాప్రతినిధులు

# స్వచ్ఛత.. ప్రతిఒక్కరి బాధ్యత



వేములవాడ: పరిసరాలను శుభ్రం చేస్తున్న చల్మెడ లక్ష్మీనరసింహారావు, చైర్‌పర్సన్ మాధవి, కమిషనర్

మహాత్మాగాంధీ జయంతిని పురస్కరించుకొని పలు గ్రామాల్లో ఆదివారం స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు, ప్రజాప్రతినిధులు పార పట్టి చెత్తను తొలగించి, చీపుర్లతో రోడ్లను శుభ్రం చేశారు. విద్యార్థులు, అన్నివర్గాల ప్రజలు కూడా శ్రమదానంలో పెద్దఎత్తున భాగస్వాములయ్యారు. స్వచ్ఛత ప్రతిఒక్కరి బాధ్యత అని.. ప్రతిఒక్కరూ బాధ్యతగా పరిసరాలను శుభ్రం చేసుకోవాలని వారు పిలుపునిచ్చారు.

*– వేములవాడ రూరల్/ కోనరావుపేట/ బోయినపల్లి/రుద్రంగి/చందుర్తి, అక్టోబర్ 1*

- పలు గ్రామాల్లో 'స్వచ్ఛతా హీ సేవ'
- పరిసరాలు శుభ్రం చేసిన అధికారులు, ప్రజాప్రతినిధులు
- పెద్ద ఎత్తున పాల్గొన్న ప్రజలు, విద్యార్థులు

● వేములవాడ, వేములవాడ రూరల్ మండలంలోని అన్ని గ్రామాల్లో రోడ్ల వెంబడి ఉన్న చెత్తాచెదారాన్ని తొలగించారు. మల్లారంలో బాబు జగ్జీవన్‌రాం వ్యవసాయ కళాశాల విద్యార్థులు శ్రమదానంలో పాల్గొని పరిసరాలను శుభ్రం చేశారు. ఇక్కడ సర్పంచులు, ఎంపీటీసీలు, ఉపసర్పంచులు, వార్డు సభ్యులు, జీపీ కార్యదర్శులు ఉన్నారు.

● చందుర్తి మండల కేంద్రంతోపాటు మూడపల్లి, పలు గ్రామాల్లో స్వచ్ఛతాహీ సేవ కార్యక్రమాన్ని నిర్వహించారు. పరిసరాలు బాగుంటేనే ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉంటారని, స్వచ్ఛత నిరంతర ప్రక్రియగా కొనసాగించాలని డీఎల్‌పీవో ప్రదీప్ సూచించారు. ఇక్కడ ఏపీఎం రజిత, జీపీ సెక్రటరీ తిరుపతి, ఉప్ప సర్పంచ్ రవి, సీఏలు విజయలక్ష్మి, వినోద, సిబ్బంది ఉన్నారు.

● కోనరావుపేట మండలంలోని అన్ని గ్రామాల్లో పరిసరాలను శుభ్రం చేశారు. ఇంటితోపాటు పరిసరాలను శుభ్రం చేసుకుంటామని గ్రామస్తులతో అధికారులు ప్రతిజ్ఞ చేయించారు. ఇక్కడ ఎంపీడీవో రామకృష్ణ, ఏపీవో మంచికట్ల శ్రీనివాస్, ఎంపీవో రాజు, సర్పంచులఫోరం మండలాధ్యక్షుడు గోపు పరశురాములు, సర్పంచులు గున్నాల అరుణ, వంశీకృష్ణారావు, ఎంపీటీసీలు ఉన్నారు.

● బోయినపల్లి మండలంలోని అన్ని గ్రామాల్లో రహదారులు, మురుగు కాలువలను శుభ్రం చేశారు. చెత్తాచెదారాన్ని తొలగించారు. ఇక్కడ ఎంపీడీవో రాజేందర్‌రెడ్డి, ఎంపీవో గంగాతిలక్, సర్పంచులు గుంటి లతాశ్రీ, ఆరెపల్లి లత, కొప్పుల లక్ష్మి, ఇల్లందుల శంకర్, ల్యాద నవిత, చిందం రమేశ్, నందయ్య, సత్యనారాయణరెడ్డి ఉన్నారు.

● రుద్రంగి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో సర్పంచ్ తర్రె ప్రభలత, అధికారులు, నాయకులు, మహిళా సంఘాల సభ్యులతో కలిసి జడ్పీటీసీ గట్ల మీనయ్య శ్రమదానం చేశారు. స్వచ్ఛతను పాటించడాన్ని అలవాటుగా చేసుకోవాలన్నారు. గ్రామాల్లో శ్రమదానం నిర్వహించి పారిశుధ్య పనుల నిర్వహణ, ప్లాస్టిక్ నిషేధం చేపడుతామని ప్రతిజ్ఞ చేశారు. ఇక్కడ ఎంపీడీవో శంకర్, ఎంపీవో సుధాకర్, కో ఆప్షన్ సభ్యురాలు జమీలా బేగం, ఐకేపీ ఏపీఎం రాజు, నాయకులు తర్రె మనోహర్, చెప్యాల గణేశ్, పిడుగు లచ్చిరెడ్డి, పల్లి గంగాధర్, మాడిశెట్టి అభిలాష్, దయ్యాల నారాయణ పాల్గొన్నారు.

### పట్టణాన్ని శుభ్రంగా ఉంచుకోవాలి: చల్మెడ

వేములవాడ, అక్టోబర్ 1: వేములవాడ పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి చల్మెడ లక్ష్మీనరసింహారావు పేర్కొన్నారు. స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో ఆదివారం ఆయన వేములవాడ పట్టణం లో మున్సిపల్ చైర్‌పర్సన్ రామతీర్థపు మాధవి, కమిషనర్ అన్వేష్‌తో కలిసి పాల్గొన్నారు. అనంతరం చల్మె డ మాట్లాడుతూ, పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించడానికి ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. ప్రతిఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. రోడ్లు, డ్రైనేజీల్లో చెత్తాచెదారం వేయవద్దన్నారు. తడి, పొడి చెత్తను వేరు చేసి ఇంటి ముందుకు వచ్చే స్వచ్ఛ ఆటోల్లో వేయాలని సూచించారు. అనంతరం పట్టణంలోని మహంకాళి ఆలయ పరిసరాల్లో శ్రమదానం చేశారు. కార్యక్రమంలో మేనేజర్ సంపత్‌రెడ్డి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ కిరణ్, కౌన్సిలర్లు, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.



కోనరావుపేట: ధర్మారంలో అవగాహన కల్పిస్తున్న ఎంపీడీవో



బోయినపల్లి: చెత్తను తొలగిస్తున్న సర్పంచ్, ఎంపీవో, మహిళలు



రుద్రంగి: గడ్డిని తొలగిస్తున్న జడ్పీటీసీ, ఎంపీడీవో, సర్పంచ్

## స్టేట్ వాలీబాల్ రిఫరీగా అనిల్ ఎంపిక

రుద్రంగి, అక్టోబర్ 1: తెలంగాణ వాలీబాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన స్టేట్ వాలీబాల్ రిఫరీ పరీక్షల్లో మండల కేంద్రానికి చెందిన సుంచు అనిల్ ఉత్తీర్ణత సాధించాడు. ఈ క్రమంలో ఆదివారం సిద్దిపేటలోని మినీ స్టేడియం గ్రౌండ్ తెలంగాణ వాలీబాల్ అసోసియేషన్ అధ్యక్షుడు గజ్జల రమేశ్ , కార్యదర్శి ఎన్‌వీ హనుమంతరెడ్డి చేతులమీదుగా అనిల్ స్టేట్ వాలీబాల్ రిఫరీ సర్టిఫికెట్ తీసుకున్నాడు. ఈ సందర్భంగా అనిల్ మాట్లాడుతూ, స్టేట్ వాలీబాల్ రిఫరీగా ఎంపిక కావడం సంతోషంగా ఉందన్నారు. ఇందుకు సహకారం అందించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు.



రిఫరీ సర్టిఫికెట్ అందుకుంటున్న సుంచు అనిల్

## లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం

గంభీరావుపేట, అక్టోబర్ 1: గోరంటాలలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో గ్రామస్తులకు ఆదివారం వైద్యులు పరీక్షలు చేశారు. ఉచిత వైద్య శిబిరంలో 150 మంది గ్రామస్తులకు బీపీ, షుగర్ తదితర పరీక్షలు చేశామని లయన్స్ క్లబ్ మండలాధ్యక్షుడు లక్కిరెడ్డి సంతోష్‌రెడ్డి తెలిపారు. ఇక్కడ లయన్స్ క్లబ్ సభ్యులు చేపూరి కిషన్, కొలుముల బాల్‌రెడ్డి, సాయబుగారి దేవదాస్ గౌడ్, నర్సింహారాజు, పాలోజీ నారాయణ, కొలుముల శ్రీనివాస్ రెడ్డి, బాల్‌రెడ్డి, తదితరులు ఉన్నారు.




వైద్య పరీక్షలు చేస్తున్న లయన్స్ బృందం సభ్యులు